క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: నౌవాస్ 11కేవీ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 1న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వుడా కాలనీ ఫేజ్–2, నౌవాస్ ఏ,బీ,సీ బ్లాకులు, పోర్టు ఏరియా, జీవీఎంసీ డంపింగ్ యార్డ్, భరత్‌నగర్, అమరావతినగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సూచించారు.

పింఛన్‌దారుని కుటుంబానికి సాయం



గాలి కృష్ణ కుటుంబానికి నగదును అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: నిర్వాసిత కాలనీకి చెందిన గాలి కృష్ణ మృతి చెందడంతో, దహన సంస్కార ఖర్చుల నిమిత్తం పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆయన కుటుంబానికి రూ.3వేల నగదు అందించింది. దానితో పాటు నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను ట్రస్ట్ అందించింది. గాలి కృష్ణకు ట్రస్ట్ నెలవారి పింఛన్ అందించేది. ఆయన మృతి చెందడంతో ఆ కుటుంబానికి సహకారం అందించారు. కార్యక్రమంలో నాయకులు గవర సోమశేఖర్, ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుడే సుశీలా గజేంద్రరావు, గవర నరసింహారావు, పట్టా రామ అప్పారావు, కిడిమి హనుమంతురావు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



ఉక్కు ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, ఉదయ కృష్ణమాచార్యులు, హరి నారాయణ స్వామి నేతృత్వంలో రుత్వికులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపించారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం ఉదయం ఆలయంలో పండిత సదస్యం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

చెత్తను తరలించారు



శుభ్రం చేయిస్తున్న జీవీఎంసీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి శ్మశాన వాటిక పక్కన పేరుకుపోయిన చెత్త, డెబ్రిస్, ప్లాస్టిక్ వ్యర్థాలను జీవీఎంసీ అధికారులు జేసీబీతో తొలగించి, చెత్తను అక్కడ నుంచి తరలించారు. ఈ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలు పేరుకుపోయి స్థానికులు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యపై ఈ నెల 28వ తేదీన 'డంపింగ్ యార్డుల్లా రహదారులు' శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై సంబంధిత అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో మంగళవారం చెత్తను తొలగించి, డంపింగ్‌యార్డుకు తరలించారు. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. రోజుల తరబడి ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

చకచకా జూనియర్ కళాశాల నిర్మాణం

- ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న నూతన భవనం
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి పూర్తిస్థాయి తరగతులు
- 600 నుంచి 700మంది విద్యార్థులకు ప్రవేశాలకు అవకాశం



ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

పెదగంట్యాడ: విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలతో పాటు కళాశాలల్లోనూ అత్యాధునిక సదుపాయాలను కల్పిస్తున్నారు. అందులో భాగంగా పెదగంట్యాడ మండలంలో ఇస్లాంపేట సమీపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అత్యాధునిక వసతులతో సిద్ధమవుతోంది. ఇప్పటికే భవనం నిర్మాణం దాదాపు పూర్తయింది. ఈ భవనం అందుబాటులోకి వస్తే పరిసర 32 గ్రామాల్లో ఇంటర్ విద్యార్థులకు దూరాభారం తప్పనుంది.

విశాల ప్రాంగణం.. గదులు

జీవీఎంసీ 77వ వార్డు పరిధిలో కళాశాల విద్యార్థుల కోసం కొత్తగా ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మించారు. జూనియర్ కళాశాలకు భవనం లేకపోవడంతో ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఓ భవనంలో కళాశాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఆ భవనం సరిపోకపోవడంతో కేవలం ఎంపీసీ, సీఈసీ గ్రూపులు మాత్రం ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మీడియంలలో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో అన్ని గ్రూపులను ప్రవేశపెట్టేందుకు, విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన భవనాన్ని సిద్ధం చేశారు. పాత భవనంలో 154 మంది విద్యార్థులు ఉన్నా రు. ఇక్కడ తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో బోధన సాగిస్తున్నారు. నాబార్డు నిధులు రూ.2 కోట్లకు పైగా, నాడు–నేడు పథకం కింద రూ.53 లక్షలతో నిర్మిస్తున్నారు. కొత్తగా నిర్మించిన ఈ భవనాన్ని వారం రోజుల్లో ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. విశాల ప్రాంగణంలోని ఈ భవనంలో పైన 4 తరగతి గదులు, కింద అంతస్తులో 4 గదులు సిద్ధమయ్యాయి. మరో భవనం కొద్ది రోజుల్లో పూర్తి కానుంది. ఈ భవనం ప్రారంభిస్తే సుమారు 600 నుంచి 700 మంది విద్యార్థులకు బోధన సాగించడానికి సౌకర్యంగా ఉంటుందని, పూర్తి స్థాయిలో కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించేందుకు ప్రణా ళికలు రూపొందిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.బెన్నస్వామి తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నామని, ఈ భవనాన్ని పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరంలో ఇక్కడే తరగతులు నిర్వహిస్తామని వివరించారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి సుధాకర్ గెలుపు దోహదం



విశాఖ విమల విద్యాలయంలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సుధాకర్ గెలుపును కాంక్షిస్తూ 67వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు చేపట్టిన ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, నాయకులు మార్టుపూడి పరదేశి, ఎస్‌ఎండీ గౌస్, పల్లా పెంటారావు, అచ్చియ్యనాయుడు, రాజేష్, వెంకటేష్, సాహిద్, బీమరాజు, అన్నపూర్ణ, లక్ష్మి, సూర్య, రవికుమార్, పల్లా శ్రీను, పల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి గ్రామం, కణితి హైస్కూల్, అంబేడ్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ప్రచారం చేశారు. మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, ప్రగడ శ్రీనివాస్, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, మార్పు గోవింద తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

గాజువాక: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ మద్దతు అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో 66వ వార్డు సినిమా హాల్ జంక్షన్ పరిసర కాలనీల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు డాక్టర్ గొర్లె సత్యనారాయణ, కోడూరు లక్ష్మీనారాయణ, నిర్మలా కిశోర్, ప్రసాదశర్మ తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి

పెదగంట్యాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతు పలకాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. పెదగంట్యాడలోని గంగవరం వెళ్లే రహదారిలో గల విశాఖ విమల విద్యాలయంలో మంగళవారం ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి, కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, వెంకటేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

65వ వార్డులో..

65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ప్రచారం చేశారు. తొలి ప్రాధాన్యత ఓటును సీతంరాజు సుధాకర్‌కు వేయాలని అక్కడ వాకర్స్, క్రీడాకారులను కోరారు. కార్యక్రమంలో పెంద్ర రాజు, అప్పలరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

భానోజీతోటలో..

వైఎస్సార్ సీపీ 65వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో భానోజీతోటలో జోరుగా ప్రచారం చేశారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి, స్వయంగా కలిసి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

దర్జీలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



సీనియర్ టైలర్లను సత్కరిస్తున్న దృశ్యం



ఎలియాస్ హోవే చిత్రటానికి పూలమాల వేసి, అంజలి ఘటిస్తున్న టైలర్లు

గాజువాక: ఆర్థికంగా వెనుకబడి ఉన్న దర్జీలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోందని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ దర్జీల దినోత్సవం సందర్భంగా గాజువాకలో దర్జీలకు మంగళవారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వృత్తిని నమ్ముకొని వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. వారికి ఆర్థికంగా భరోసానిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.10 వేల చొప్పున సాయం అందిస్తోందన్నారు. ఒకప్పుడు దర్జాగా సాగిన దర్జీల జీవనం నేడు దయనీయంగా ఉందన్నారు. వారి జీవితాల్లో మార్పు రావాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని పేర్కొన్నారు. మంగళగిరి కాంప్లెక్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాజేశ్వరినాయుడు, ఏవీఎస్ఎన్ గుప్త, ప్రతాప్ కుమార్, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, ప్రభాకర్, అప్పారావు, మురళి, హేమ, వేణు, జయ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల కుటుంబాల్లో వెలుగులు

అక్కిరెడ్డిపాలెం: టైలర్స్ కుటుంబాల్లో వెలుగులు నింపింది జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే అని విశాఖ జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కూనూరు మల్లికేశ్వరరావు అన్నారు. టైలర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 68వ వార్డు రాంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కుట్టుమిషన్ సృష్టికర్త ఎలియాస్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. వారు మాట్లాడుతూ తాము ఎందరో ముఖ్యమంత్రులను చూశాం గానీ, తమ గురించి ఎవరూ పట్టించుకోలేదని.. కానీ తమను సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే గుర్తించి, సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. తమ కుటుంబాలను ఆదుకుంటున్న మహానుభావుడని కొనియాడారు. కార్యక్రమంలో సీహెచ్.త్రినాథ్, బొడ్డు సాంబశివరావు, దొడ్డి శ్రీను, జి.శ్రీనివాస్, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో..

అగనంపూడి: టైలర్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని అగనంపూడి వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు జి.పూర్ణానందశర్మ అన్నారు. దర్జీల దినోత్సవం సందర్భంగా 79వ వార్డు అగనంపూడి సత్రం కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో అగనంపూడికి చెందిన మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో టైలర్లు, స్థానికులకు నార, గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ చిత్తా రామారావు, చిత్తా శోభారాణి, విందుల వరప్రసాద్, మౌళి, చల్లారావు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్‌లో ఎస్టీ సంఘాన్ని ప్రత్యేకంగా గుర్తించాలి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఎస్టీ సంఘాన్ని ప్రత్యేకంగా గుర్తించాలని స్టీల్‌ప్లాంట్ ఎరుకుల ఉద్యోగులు కోరారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా సిఫార్సు చేసిన రాష్ట్ర ఎస్టీ సంఘం చైర్మన్ కుంభా రవిబాబును వారు మంగళవారం విశాఖలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎస్టీ ఉద్యోగుల సమస్యలను ఆయనకు వివరించారు. అన్ని కర్మాగారాల్లో ఎస్టీ సంఘం ప్రత్యేకంగా ఉండగా, స్టీల్‌ప్లాంట్‌లో మాత్రం ఎస్సీ, ఎస్టీలకు ఒకే సంఘంగా ఉందన్నారు. దీనివల్ల స్టీల్‌ప్లాంట్‌లో ఎస్టీలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరగడం లేదన్నారు. దీనిపై రవిబాబు స్పందిస్తూ ఈ అంశంపై స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి లేఖ రాస్తానని హామీ ఇచ్చినట్టు కూరాకుల దుర్గారావు, వీరేశం, సుబ్రమణ్యం, కాండ్రకుంట రాజు, మల్లి వెంకటరమణ తెలిపారు.

ఘనంగా పర్వతాంజనేయ స్వామి పరస



అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం వివేకానందకాలనీలో కొలువైయున్న పర్వతాంజనేయ స్వామి పరస మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. స్వామికి తమలపాకుల పూజ, నిమ్మకాయల పూజతో పాటు సిందూరార్చన చేశారు. వడమాలతో అలంకరించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి సండ్రాన నూకరాజు, ఆలయ కమిటీ ప్రతినిదులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆటోనగర్ డి-బ్లాక్‌లో 'స్వచ్ఛ పక్వాడా'

ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో నిర్వహణ



ఆటోనగర్ డి-బ్లాక్‌లో రోడ్లు శుభ్రం చేస్తున్న ఎంఎస్ఎంఈ, వాసీవా, ఐలా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ డీ బ్లాక్‌లో మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) ఆధ్వర్యంలో ఆటోనగర్ ఐలా, విశాఖ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) సహకారంతో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీ బ్లాక్‌లోని విశాఖ రూఫింగ్ ఇండస్ట్రీ వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అధికారులు, వాసీవా, ఐలా ప్రతినిధులు, పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొని, రోడ్లను శుభ్రపరిచారు. పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. బ్యానర్లను చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. తమ పరిశ్రమలతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలన్నీ శుభ్రంగా ఉండేటట్లు నిర్వహణ చేపడతామని పారిశ్రామిక వేత్తలు ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ, వాసీవా అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, ఉపాధ్యక్షుడు కృష్ణప్రసాద్, ఐలా ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఎంఎస్ఎంఈ ఏడీ, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ ప్రభాకర్ కుమార్, ఎస్.ఎల్.ఎన్.కుమార్, రెడ్డి, అప్పికొండ శ్రీనివాస్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్రప్రభుత్వం



747వ రోజు దీక్షలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

కూర్మన్నపాలెం: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడమే కాకుండా, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలను ప్రజలు తిప్పికొట్టే సమయం ఆసన్నమైందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో 747వ రోజు సంస్థకు చెందిన డీఎస్‌డబ్ల్యూ, ఈఆర్ఎస్‌డీ, ఈటీఎల్ కార్మికులు కూర్చున్నారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తూ, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. కార్మిక శ్రేయస్సు కోరి ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే కేంద్ర ప్రభుత్వానికి ప్రజాతీర్పుతో తగిన గుణపాఠం నేర్పుతామని అన్నారు.

ప్రీతి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి



స్టీల్‌ప్లాంట్ అంబేడ్కర్ పార్కులో నివాళులర్పిస్తున్న నాయకులు



గాజువాకలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు

గాజువాక: తెలంగాణలో జూనియర్ డాక్టర్ ప్రీతి నాయక్ మృతి కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ గాజువాక నాయకులు మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలా కిశోర్ మాట్లాడుతూ జనగామ జిల్లాలోని గన్ని తండా ప్రాంతానికి చెందిన ప్రీతి నాయక్ ఆత్మహత్యకు గురి కావడం బాధాకరమన్నారు. ఆమె మృతికి కారకులైనవారిపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు వి.రోహిణి, కోడూరు లక్ష్మీనారాయణ, తుమ్మల పద్మజ, శ్రీదేవి, భువనేశ్వరి, శిరీష, వాణి, భారతి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన

ఉక్కునగరం: ప్రీతి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశాఖ బంజారీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. డాక్టర్ ప్రీతి మృతికి నిరసనగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉక్కునగరం సెక్టార్–6 అంబేడ్కర్ పార్కులో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను రక్షించడానికి ప్రయత్నాలు మానుకుని, అతడిని కఠినంగా శిక్షించాల్సిన బాధ్యత తెలంగాణా ప్రభుత్వంపై ఉందన్నారు.

సృజనకు దర్పణం వైజ్ఞానిక ప్రదర్శనలు

పెదగంట్యాడ: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలను నిర్వహించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతకు అద్దం పట్టేలా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలు ప్రశంసలందుకున్నాయి.

నడుపూరు హైస్కూల్లో..

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనను వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. సైన్స్ డేను పురస్కరించుకుని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుపూరు హైస్కూల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులను రూపొందించి, ప్రదర్శించారు. వాటి గురించి వివరించి ఆకట్టుకున్నారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇటువంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు సీహెచ్ హైమావతి, కొండలరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల మేధాశక్తి పెంపునకు దోహదం

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థుల మేధాశక్తికి సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతో దోహదం చేస్తాయని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం అన్నారు. సైన్స్ డే సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు పలు అంశాలపై నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. డ్రిప్ ఇరిగేషన్, స్నేక్ సేవర్, వర్షపు నీటి నిల్వ, హైడ్రాలిక్ బ్రిడ్జి, పెరిస్కోప్ తదితర నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేముళ్లు, అన్నపూర్ణ, సావిత్రి, రాధారాణి, రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.



నడుపూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు



అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

గాజువాక: స్థానిక చలపతి పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. 70వ వార్డులోని ట్వింకిల్ కిడ్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సర్ సీవీ రామన్, అబ్దుల్ కలాం లాంటి మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ ప్రారంభించారు. విద్యార్థుల ప్రాజెక్టులను తిలకించి, వారిని అభినందించారు.

పరిశోధనలు నిర్వహించే స్థాయికి చేరుకోవాలి

విద్యార్థులు విజ్ఞాన శాస్త్రాన్ని నేర్చుకోవడంతోపాటు పరిశోధనలను నిర్వహించే స్థాయికి చేరుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్గానిక్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ సిద్ధయ్య సూచించారు. సైన్స్ డే సందర్భంగా స్థానిక చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన విజ్ఞాన సదస్సులో ఆయన ప్రసంగించారు. విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టు నమూనాలను పరిశీలించి, అభినందించారు. పొగ గ్రాహక యంత్రం, భూకంప సూచి, డిస్టిలర్ వాటర్ శానిటైజర్, ఫినాయిల్, కాలుష్య రహిత సబ్బుల తయారీ వంటి నమూనాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థినులు

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



పూజలో పాల్గొన్న ఉభయదాతలు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

2న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో మార్చి 2న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

కంటి సంరక్షణపై అవగాహన



నేత్ర సంరక్షణ గురించి వివరిస్తున్న విద్యార్థులు

అగనంపూడి: కంటి సంరక్షణపై అవగాహన కల్పిస్తూ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రహ్లాదపురంలోని శంకర్ ఫౌండేషన్ వద్ద, వివిధ ప్రాంతాల్లో సుమారు రెండు వందల మంది విద్యార్థులు పాల్గొని, కళ్ల సంరక్షణపై నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి సుందర్‌రామన్ ఆధ్వర్యంలో వలంటీర్లు సేవలు అందించారు. సుందర్‌రామన్ మాట్లాడుతూ కంటి సంబంధమైన వ్యాధులు, ముందస్తు చికిత్సలపై ఆస్పత్రికి వచ్చే రోగులకు, వారి సహాయకులకు అవగాహన కల్పించామన్నారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.